సాక్షి
ఏలూరు
బుధవారం । 8 । మే । 2024




కోతలు వాయిదా వేసుకోండి

జంగారెడ్డిగూడెం: వచ్చే నాలుగు రోజులు వర్షాలు పడతాయనే హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారి పోశారావు సూచించారు.



ఘనంగా శ్రీచక్రస్నానం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీచక్రస్నానం ఘనంగా నిర్వహించారు.



టీడీపీ, జనసేనకు రాంరాం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

పోలింగ్ నిర్వహణకు పటిష్ట ప్రణాళిక



సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డీఆర్వో

ఏలూరు(మెట్రో): ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రం, పోలింగ్ కేంద్రాల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 12న ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లను అంశాల వారీగా సమీక్షించారు. హెల్ప్‌డెస్కుల ఏర్పాట్లు, పీఏ సిస్టమ్, తాగునీరు, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లపై సూచనలు చేశారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ పూర్తయిన పిదప డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుని సంబంధిత పత్రాలు స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలు, పత్రాలు అందజేసి తిరిగి వెళ్లే సిబ్బందికి బస్సు సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్, పార్కింగ్ ప్లాన్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. ఆయా కౌంటర్లకు సంబంధించి సైన్ బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లో కౌంటర్లకు అనుగుణంగా టేబుళ్ల ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లు, సీళ్లు తదితర అంశాలను క్షుణంగా పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ రోజున ఉదయం మాక్‌పోల్‌ను పటిష్టంగా నిర్వహించి అనంతరం బటన్ క్లియర్ చేసి పోలింగ్ ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలతో కూడిన ఓటరు హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో డి.పుష్పమణి, కలెక్టరేట్ ఏఓ కె.కాశీ విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లు కొనసాగించాలి



ఎండీ కామిలు జమ

ఏలూరు టౌన్: దివంగత సీఎం వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించారని, నేడు ఆయన తనయుడు సీఎం జగన్ వాటిని కొనసాగిస్తున్నారని.. ముస్లిం రిజర్వేషన్లు కొనసాగించాల్సిందేనని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ డాక్టర్ ఎండీ కామిలు జమ అన్నారు. మంగళవారం ఆయన ఏలూరులో మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలపై విషం కక్కుతూ.. రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ చెప్పటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లిం రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చిందనీ, చంద్రబాబు కాషాయ పార్టీతో పొత్తు పెట్టుకుని ముస్లింల ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కొనసాగిస్తామని చంద్రబాబు సభల్లో ప్రధాని మోదీ సాక్షిగా చెప్పే దమ్ముందా? అని ప్రశ్నించారు. ముస్లింలంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

ఫిర్యాదుల స్వీకరణకు గడువు పెంపు


ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీ జీఎల్ఐ పాలసీదారుల ఫిర్యాదుల స్వీకరణ గడువును ఈనెల 31వ వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. గడువు పొడిగించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థనకు అధికారులు స్పందించారన్నారు.

తనిఖీలు ముమ్మరం

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరిచే చర్యలను నియంత్రించడంలో భాగంగా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాల తనిఖీలు ముమ్మరం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నైతికపరమైన ఎన్నికల నిర్వహణకు ప్రతి అధికారీ కృషి చేయాలన్నారు. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న దృష్ట్యా నగదు, మద్యం వంటివి చలామణి కాకుండా చర్యలను తీసుకోవాలని, సంబంధిత ఆర్వోలు ఆయా నిఘా బృందాల పనితీరును రాత్రిపూట పరిశీలించాలన్నారు. ఎన్నికల పోలింగ్ రోజు ముందుగా జిల్లాలో పలు రాజకీయ పార్టీలు, ప్రతినిధులు ఓటర్లను ప్రలోభపరిచేందుకు నగదు పంపిణీ, పలు మార్గాలు అవలంబించే అవకాశం ఉందన్నారు. ఈవీఎం యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, ఇతర సామగ్రిని అందించేందుకు, వాహనాల ఏర్పాట్లపై ఆర్వోలు పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

- చౌకగా భూములు స్వాహా
- సోదరుడి అధికారంతో తమ్ముడు రియల్ దందా
- అప్పు తీర్చలేదని ఫ్యాన్సీ షాపు స్వాధీనం
- వివాదాస్పద భూములపై నిరంతర నిఘా
- ఈదర సుబ్బమ్మదేవి స్కూల్ మైదానం ఆక్రమణ
- **తప్పుడు రికార్డులు పుట్టించి ప్రభుత్వ భూముల విక్రయాలు**
- **ఏలూరు టీడీపీ అభ్యర్థి బడేటి చంటి దందాల పర్వం**

గజం రూ.లక్ష ఉన్న భూమిని రూ.50 వేలకు బేరం చేయడం.. ఇవ్వకపోతే సోదరుడి అధికారాన్ని ఉపయోగించుకుని స్థలంలో సమస్యలు సృష్టించడం.. కాళ్ల బేరానికి తెచ్చుకుని చౌకగా కొట్టేయడం.. ఇది ఏలూరు నగర టీడీపీ అభ్యర్థి **బడేటి చంటి గతంలో సాగించిన రియల్ ఎస్టేట్ దందా.**



కబ్జాపర్వం.. దందాలే సర్వం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 2014–19 కాలంలో బడేటి బుజ్జి ఎమ్మెల్యేగా అధికారంలో ఉండగా బడేటి చంటి నగరంలో లెక్కకు మించి ఆస్తులు కూడగట్టారు. పలు సెంటర్లల్లో పదుల సంఖ్యలో భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ చౌకగా కొట్టేయడం.. ఎక్కువ ధరకు అమ్మడం, సొమ్ము చేసుకుని సర్దుకోవడం ఇలా ఐదేళ్ల పాటు రియల్ దందాకు ఏలూరు నగరాన్ని వేదికగా మార్చారు. వివాదాస్పద భూములపై నిరంతరం డేగ కన్ను వేసేలా ఒక స్పెషల్ టీమ్, మార్కెట్‌లో వివాదంలో ఉన్న ఆస్తుల గురించి తెలుసుకోవడానికి మరో టీమ్ ఐదేళ్ల పాటు కొనసాగిందంటే దందాలు ఏ స్థాయిలో సాగాయో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ పాలనలో ఎన్నెన్నో అక్రమాలు

- ఏలూరు నగరంలో ఈదర సుబ్బమ్మదేవి స్కూల్ ఫేమస్. ఆ సెంటర్‌కు కూడా అదే పేరు ఉంటుంది. స్కూల్, స్కూల్ సమీపంలో సుమారు 4 వేల చదరపు గజాల స్థలాన్ని ఈదర సుబ్బమ్మదేవి కుటుంబీకులు పూర్వంలో పాఠశాల ఆట స్థలానికి ఇచ్చారు. ప్రస్తుతం ఆ స్కూల్ నగరపాలక సంస్థ ఆధీనంలో ఉంది. క్రీడా ప్రాంగణం మాత్రం స్కూల్ ఆధీనంలో కాకుండా వివాదంలో ఉంది. 2014–19 సమయంలో ప్రాంగణంలో కొంత భాగాన్ని ఒకరికి అమ్మడం, రకరకాల అంశాల నేపథ్యంలో అక్కడ నిర్మాణం కూడా కొంత మేరకు చేశారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ మొత్తం కోర్టు ఉత్తర్వులతో నిలిచిపోయింది.
- 30 ఏళ్ల పాటు బడేటి బుజ్జితో సన్నిహితుడిగా ఉండి రైట్ హ్యాండ్‌గా మెలిగిన టీడీపీ నేత గొట్టాపు జయరామకృష్ణ భార్యకు సంబంధించిన 150 గజాల స్థలంపైనా సదరు నేత కన్నుపడటం, ఇవ్వకపోవడంతో నకిలీ పత్రాలు సృష్టించి వివాదంలోకి నెట్టడంతో ప్రస్తుతం ఈ వ్యవహారం కూడా **కోర్టులో** సాగుతుంది. సదరు **జయరామకృష్ణ చంద్ర**బాబు, లోకేష్, అచ్చెన్నాయుడుతో పాటు జిల్లాలోని టీడీపీ నాయకులందరి వద్దకు పలుమార్లు తిరిగి న్యాయం చేయమని ప్రాధేయపడినా స్పందన నిల్.
- విజయ వాచ్ కంపెనీ ఎదురుగా ఓ ఫ్యాన్సీ షాపు నిర్వాహకుడు తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వలేదని షాపును స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- కార్పొరేషన్ సమీపంలోని ఓ హోటల్ స్థలాన్ని, ఫైర్‌స్టేషన్ సెంటరులోని ఓ హోటల్ స్థలాన్ని 50 శాతం డిస్కౌంట్ రేటులో సెటిల్ చేసుకుని మంచి ధరకు విక్రయించిన ఉదంతం ఐదేళ్ల టీడీపీ పాలనలో జరిగింది.
- కృష్ణా కెనాల్ సమీపంలోని ఓ టీ సెంటర్ వద్ద పాత బిల్డింగులు, అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద ఓ షోరూమ్ బిల్డింగ్ ఇదే రీతిలో తక్కువ ధరకు సెటిల్ చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- 20 ఏళ్ల క్రితం గడియార స్తంభం దగ్గర ఓ స్థలాన్ని సెట్ చేసుకుని షాపులు కూడా కట్టారని పలువురు అంటున్నారు. ఇలా గత టీడీపీ పాలనలో కబ్జాపర్వం సాగింది.

ప్రభుత్వ ఆస్తులపైనా కన్ను

'నేను సౌమ్యుడిని.. ఎవరి రూపాయి నాకు అక్కర్లేదు.. నా కష్టంతో నేను రాజకీయం చేసుకుంటున్నాను' అంటూ.. రోజూ టీడీపీ అభ్యర్థి బడేటి చంటి చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉండదు. తన సోదరుడు ఎమ్మెల్యేగా ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో అన్నీ తానై చక్రం తిప్పడంతో పాటు ఖజానా కూడా నింపుకున్నారనేది నగరంలో వినిపించే బలమైన టాక్. ప్రైవేట్ ఆస్తులే కాదు ప్రభుత్వ ఆస్తులకు కూడా ఆయన రికార్డులు సృష్టించి కొత్తగా వారసులను తెచ్చి స్వాహా చేసిన ఉదంతాలు ఉన్నాయి.

బార్ సిండికేట్ వారిదే..

తెలుగుదేశం పార్టీ హయాంలో ఏలూరు నగరంలో లిక్కర్ సిండికేట్ హవా బాగా నడిచింది. 15 బార్లు, 54 వైన్‌షాపులు నగరంలో ఉన్నాయి. రాష్ట్రమంతా ఉన్న ధర కంటే ఇక్కడ మద్యానికి కొంత అదనపు ధర వసూలు చేసేవారు. ఎందుకంటే వ్యాపారంలో పోటీ లేకపోవడమే కారణం. లిక్కర్ వ్యాపారులందరినీ సిండికేట్ చేయడం, సిండికేట్‌లో తక్కువ మొత్తం పెట్టి ఎక్కువ శాతం తెలుగుదేశం పార్టీ ముఖ్యులే తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా నగరంలో ఐదేళ్ల పాటు మద్యాన్ని ఏరులై పారించి కోట్లు దండుకున్నారు.

13,103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్



ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు(మెట్రో): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ మంగళవారం కూడా ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా మీడియా సమన్వయకర్త, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పోలింగ్ సజావుగా జరగడానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద లైజన్ అధికారులను కూడా ఏర్పాటుచేశామని, తక్షణ సమాచారం కోసం సెల్ 9849903321 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఏలూరు కోటదిబ్బలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏలూరు కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, అధికారులతో కలిసి తాను పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించినట్టు చెప్పారు. .

జిల్లాకు చెందినవి 6,983

జిల్లాలో మూడు రోజులుగా 13,103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటిలో ఏలూరు జిల్లాకు సంబంధించి 6,983 ఓట్లు, ఇతర జిల్లాలకు చెందిన 2,171 ఓట్లు పోలయ్యాయి. అత్యవసర సర్వీసు సిబ్బందికి సంబంధించి 1,831 ఓట్లు, మైక్రో అబ్జర్వర్స్‌కు సంబంధించి 258 ఓట్లు, ఇతరులు సంబంధించి 1,860 ఓట్లు పోలయ్యాయి.

స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ఏలూరు టౌన్: దేశంలో ప్రతి పౌరునికీ రాజ్యాంగం అతి పవిత్రమైన ఓటు హక్కును కల్పించిందనీ.. ప్రతి పౌరుడు విధిగా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరులో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ బూత్‌కు వెళ్లి ఆమె ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసి బయటకు వచ్చిన అనంతరం వేలిపై ఇంక్‌ను చూపిస్తూ.. ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లోనుకాకుండా తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం కల్పించటంతో పాటు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి చెప్పారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచార జోరు



పెదవేగి: రామశింగవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



జంగారెడ్డిగూడెం రూరల్: తిరుమలాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు



మండవల్లి: నుచ్చుమిల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

పెదవేగి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. పెదవేగి మండలంలోని రామసింగవరంలో దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 179 జగనన్న కొఠారు కాలనీలు ఏర్పాటుచేశామని, 25 వేల మందికి ఇళ్ల స్థలాలు, ఇల్లు ఇచ్చామని చెప్పారు. రూ.18 కోట్లతో తమ్మిలేరుపై బలివే బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే నియోజకవర్గవ్యాప్తంగా సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లు, సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించామన్నారు. విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రూ.250 కోట్లతో 5 కొత్త సబ్‌స్టేషన్‌లను నిర్మించడంతోపాటు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, వందల కిలోమీటర్ల విద్యుత్ లైన్లు వేయించామన్నారు. ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

జంగారెడ్డిగూడెం రూరల్: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పథకాలు అమలు చేశారని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం కేతవరం, తిరుమలాపురం, శోభనాద్రిపురం, కృష్ణంపాలెం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలనను చేరువ చేశారన్నారు. అర్హులందరికీ నవరత్నాల పథకాలు చేరువయ్యాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలతో పాటు మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి మరింత ముందుకు సాగాలంటే జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ కనుపర్తి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నరెడ్ల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మండల యూత్ అధ్యక్షుడు ఎలికే పవన్ కుమార్, నాయకులు ఉన్నారు.

మండవల్లి: పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. మండవల్లి మండలంలోని నుచ్చుమిల్లి, ఇంగిలిపాకలంక గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు భారీ మెజార్టీతో విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు. జగన్ మరోమారు ముఖ్యమంత్రి అయితేనే పథకాలన్నీ కొనసాగుతున్నాయన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, గ్రామ పెద్దలు ముసరబోయిన బ్రహ్మయ్య, బసవయ్య, నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఘంటసాల దుర్గాప్రసాద్, బాలశౌరి, సర్పంచ్‌లు సైదు చంద్రయ్య, నాగేశ్వరరావు, జయమంగళ కాసులు తదితరులు ఉన్నారు.

గుడ్ మార్నింగ్.. ఏలూరు

ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ ప్రచారం



వాకర్స్‌ను పలకరిస్తున్న ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: వేకువజామున గుడ్ మార్నింగ్ ఏలూరు అంటూ వినూత్న రీతికి ప్రచారానికి తెరతీశారు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్. యువతకు అండగా ఉంటానంటూ భరోసా ఇస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. జాగింగ్ చేస్తూ అభిప్రాయాలు తెలుసుకున్నారు. యువత భవిష్యత్ కోసం తాను ఏం చేయాలో తెలుసుకోవడంతో పాటు వాకర్స్‌ను ఆప్యాయంగా పలకరిస్తూ నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ప్రజలకు విద్య, వైద్యంపై అవగాహన కల్పిస్తున్న యువతతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ మమేకమయ్యారు. ఇలా ఏలూరు సర్ సీఆర్ఆర్ కళాశాల గ్రౌండ్స్, ఇండోర్ స్టేడియం, అల్లూరి సీతారామరాజు స్టేడియాల్లో తిరుగుతూ ప్రజల మనసులు గెలుచుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటూ, భవిష్యత్‌కు బాటలు వేసే నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

ఈదురుగాలులు.. భారీ వర్షం

ఉక్కపోత, భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనాన్ని కలిగించేలా వరుణుడు కరుణించాడు. జిల్లావ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం కారుమబ్బులు, ఈదురు గాలులతో భారీవర్షం కురిసింది. సగటును 1.5 మి.మీ వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

-ఏలూరు (మెట్రో)



ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రంలో..



నూజివీడు: నూజివీడు పట్టణంలో కురుస్తున్న వర్షం



పెదవేగి : ధాన్యం రాసులపై బరకాలు కప్పుతున్న రైతులు



భీమడోలు: నేలకొరిగిన విద్యుత్ స్తంభం



నిడమర్రు: మండలపరిధిలో కూలిన వృక్షం

సంక్షేమ జీవన సౌందర్యం


దేవరకొండ నాని, మేరీ దంపతులు, కుమారుడు

అప్పుల నుంచి ఉన్నతస్థా'నాని'కి.. • దారిద్ర్య రేఖను దాటిన దేవరకొండ నాని, మేరీ కుటుంబం
• పనుల కోసం నూజివీడుకు వలస వచ్చి జీవనం • వైఎస్ జగన్ సీఎం అయ్యాక కష్టాలన్నీ దూరం

సొంతూరిలో పనులు లేక కట్టుబట్టలతో, ముగ్గురు పిల్లలతో 13 ఏళ్ల క్రితం ఏలూరు జిల్లా నూజివీడుకు వలస వచ్చారు దేవరకొండ నాని, మేరీ దంపతులు. వీరి స్వగ్రామం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం ఆరుగొలను. ఒక కుమార్తె, ఇద్దరు కుమారులను చదివించుకోవాలంటే తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనేవారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితులు కావడంతో పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని దంపతులు నిత్యం మదనపడుతూ ఉండేవారు. పిల్లలను మంచి చదువులు చదివించగలుగుతామో లేదోననే బాధ వారిని నిరంతరం వేధిస్తూ ఉండేది. పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఎనిమిది ప్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా నాని చేరారు. అక్కడే ఉంటూ ఇస్త్రీ కూడా చేస్తూ పిల్లలను చదివిస్తూ వచ్చారు. ఇద్దరు మగపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ, ఆడపిల్లను మాత్రం ప్రైవేటు స్కూల్లో చదివించేవారు. వీరి చదువులు, ఫీజులకు ఏటా రూ.50 వేల వరకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది. సంపాదన మూరెడు, ఖర్చు బారెడు కావడంతో ఏడాదికేడాదికి అప్పులు పెరుగుతూనే వచ్చాయి. ఒకవైపు ఇల్లు గడవడం కష్టంగా ఉండటం, మరోవైపు అప్పులు పెరుగుతూ రావడంతో ఆ దంపతులు తల్లడిల్లిపోయేవారు.

2019 తరువాత పరిస్థితి మారిపోయింది

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావడంతో నాని, మేరీల కుటుంబ పరిస్థితి మెరుగుపడింది. పెద్ద కుమార్తె విజయ డిగ్రీకి రావడంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేయడంతో ఫీజుల భారం తప్పింది. అంతకుముందు ఇంటర్ రెండేళ్లు చదివించడానికి నాని రూ.50 వేలు అప్పు చేశాడు. డిగ్రీ జగనన్న దయ వల్ల పూర్తయింది. ఇద్దరు కుమారుల్లో ఒక కుమారుడికి అమ్మఒడి పథకం రావడంతో ఈ నాలుగేళ్లుగా పిల్లలను చదివించడానికి ఎలాంటి ఇబ్బందీ ఎదురుకాలేదు. మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద తినడం, జగనన్న విద్యాకానుక ద్వారా బ్యాగులు, షూలు, పుస్తకాలు, యూనిఫాం తదితర వాటి నన్నింటినీ ప్రభుత్వమే ఉచితంగా అందజేయడంతో పిల్లల చదువులు ఎలాంటి భారం లేకుండా సాగుతున్నాయి. నాని ఇస్త్రీ చేస్తుండటంతో రెండేళ్లుగా జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు వస్తున్నాయి. అవి వేడి నీళ్లకు చన్నీళ్ల తోడు లాగా ఉపయోగపడుతుండేవి. మేరీ డ్వాక్రా గ్రూపులో ఉండటంతో ఏటా రుణమాఫీ కింద రూ.20 వేలు నగదు వస్తోంది. ఇప్పటికి రూ.60 వేలు రాగా, ఈ ఏడాది మంజూరు చేసిన రూ.20 వేలు బ్యాంకు ఖాతాలో పడాల్సి ఉంది. వచ్చిన సొమ్మును కుటుంబ అవసరాలకు ఉపయోగించుకుంటూ కుటుంబాన్ని జాగ్రత్తగా ముందుకు నడుపుకుంటున్నారు. అంతక్రితం చేసిన అప్పులూ తీర్చేశారు. మగపిల్లలు ఇద్దరూ ఇంటర్ చదువుతుండగా, కుమార్తె డిగ్రీ పూర్తి చేయడంతో ఆమెను హైదరాబాద్ పంపించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం శిక్షణను ఇప్పించుకుంటున్నారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్లే సాధ్యమైందని, తమ కుటుంబం నేడు ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తోందని దంపతులిద్దరూ ఆనందబాష్పాలతో చెబుతున్నారు. తాము జీవితాంతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని చెప్పారు.

- నూజివీడు

పేదింటి కూటికుండ నవ్వింది

"ముగ్గురు పనికెళితే గానీ పొయ్యి మీద కూటికుండలో బువ్వ ఉడకని బతుకులు వారివి. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన దాంట్లో సగం అద్దె ఇంటికే ధారపోయాలి. పండగలొస్తే పక్కింటి నుంచి పిండివంటల ఘుమఘుమలను పీలుస్తూ ఏంటి దేవుడా? మాకీ దుస్థితి అంటూ కుమిలిపోయిన సందర్భాలు అనేకం. పెద్ద చదువులు చదవాలనే కసి ఉన్నా సాయం చేసే చేతులు లేక కళ్లలో దుఃఖాన్ని పైకి కనిపించకుండా ఇంటి పనులు చేసుకునే పిల్లలు. ఇదీ గతంలో ఏలూరు జిల్లా మండలవల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన పులవర్తి ఆంజనేయులు కుటుంబ దుస్థితి. ఇప్పుడు వీరి ఇంటిలో సంతోషాల సిరులు వెల్లివిరిస్తున్నాయి. నవరత్నాలతో నిత్యం నవ్వులు పూస్తున్నాయి."


పులవర్తి ఆంజనేయులు కుటుంబం

జగనన్న ఇచ్చిన వరం సొంతిల్లు



బీటలు వారిన భూములను ఒక్కసారిగా వర్షపు జల్లులు అభిషేకించినట్టు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే ఆంజనేయులు ఇంటిలో కొత్త ఆశలు చిగురించాయి. నేరుగా ప్రభుత్వ పథకాలు తలుపుతట్టాయి. ఆపన్న హస్తం అందించాయి. ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందాయి. దీంతో పేద కుటుంబం ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుంది. కొత్త ఇంటిలోకి హాయిగా గృహప్రవేశం కూడా చేసింది. పెద్దింట్లమ్మ డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉండటంతో ఆమెకు నాలుగు విడతలుగా ఆసరా సాయం రూ.80 వేలు దక్కింది. సామ్రాజ్యమ్మకు చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున మూడేళ్లకు రూ.56,250 అందింది. ఇక ఆంజనేయులు కుమారుడు ప్రకాష్, కుమార్తె దీవెన ఇద్దరూ గుడివాడలో కార్పొరేట్ కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరికి జగనన్న విద్యా దీవెన ద్వారా ఒక్కో ఏడాది రూ.20 వేలు చొప్పున రెండేళ్లకు రూ.40 వేలు అందింది. ఇద్దరికీ కలిపి ఈ ఒక్క పథకం ద్వారా రూ.80 వేల ప్రభుత్వ సాయం పొందారు. వీరు ఇంటర్ చదువుతున్నప్పుడు కూడా అమ్మఒడి సాయం అందింది. దీంతో ఆంజనేయులు కుటుంబం ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. కరోనా సమయంలోనూ జీవనానికి ఇబ్బంది లేకుండా పోయింది.

20 ఏళ్లు అద్దె ఇంట్లో నరకం

ఆంజనేయులు లారీ క్లీనర్. ఈయనకు భార్య పెద్దింట్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరితోపాటే ఆంజనేయులు తల్లి సామ్రాజ్యమ్మ కూడా ఉంటుంది. దాదాపు ఇరవయ్యేళ్ల నుంచి అద్దె ఇంట్లోనే మగ్గుతున్నారు. ఆంజనేయులుకు క్లీనర్‌గా వచ్చేది అంతంత మాత్రం కావడంతో భార్య పెద్దింట్లమ్మ, తల్లి సామ్రాజ్యమ్మ ఇద్దరూ రోజూ కూలి పనులకు వెళ్తున్నారు. ముగ్గురి కష్టం మీద ఈ కుటుంబాన్ని నెట్టుకురావాల్సిన పరిస్థితి ఉండేది. కుటుంబ యజమాని క్లీనర్‌గా లారీలపై దూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల ఒక్కోసారి ఆరోగ్యం బాగాలేక పనికి వెళ్లలేని పరిస్థితి వచ్చేది. ఆ సమయంలో భార్య, తల్లి కూలి డబ్బులే ఆధారంగా ఉండేవి.

- కైకలూరు

అల్లూరితో మన్యంలో విప్లవ చైతన్యం


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మన్యంలో విప్లవ చైతన్యాన్ని తెచ్చి ముందుండి స్వాతంత్ర్య పోరాటం నడిపిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, ఐలు, మానవత, ఏపీఎంఎస్ఆర్‌యూ, హేలాపురి సింగర్స్, జోఫ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి సభ నిర్వహించారు. సభకు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. గిరిజనులలో ఐకమత్యం నింపి బ్రిటిష్ కసాయి ముష్కర పాలనకు వ్యతిరేకంగా పోరాటం నడిపి అల్లూరి అమరుడు అయ్యాడన్నారు. దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి అమాయక ప్రజలకు అండగా నిలిచిన గొప్ప వ్యక్తి అన్నారు. తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి దేవరకొండ వెంకటేశ్వర్లు, వీజీఎంవీఆర్ కృష్ణారావు, ఆలపాటి నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నజీమ్ హమీద్ అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం, ఎస్.ఠాగూర్ సంపత్ నృత్య ప్రదర్శన, సోమ్లా నాయక్, వై.అర్జునరావు, పీ సూర్యప్రకాష్, పీశ్రీనివాసరావులు పాడిన పాటలు, కె.శ్రీనివాసరావు, పీ కార్తికేయ కవితలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బీ సోమయ్య, కే శ్రీనివాస్, ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, మేతర అజయ్‌బాబు, బీవీవీ సుబ్రహ్మణ్యం, డీ గణేష్, టీ రమేష్, పీ వెంకట్, ఎం.మిల్టన్, పీ అనురాధ పాల్గొన్నారు.

ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే

ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు


ఆగిరిపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్

ఆగిరిపల్లి : ఎన్నికల్లో ఎన్ని పార్టీల జెండాలు జతకట్టినా, ఎంతమంది కలిసొచ్చినా రాష్ట్రంలో మళ్లీ ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే అని ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం సీతారామపురం, కొత్త ఈదర, సాయంత్రం ఆగిరిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగన్‌పై ఒంటరిగా పోటీ చేసి గెలిచే సత్తా లేకనే చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. పొత్తులు లేకుండా ఒంటరిగా చంద్రబాబు ఏనాడూ ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. 2014 ఎన్నికల ముందు 600 పైగా అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటి నెరవేర్చకపోగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. ప్రస్తుతం బాబు హామీలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఆగిరిపల్లిలో దాదాపు రూ.100 కోట్ల పైనే డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాల లబ్ధి అందించామన్నారు. ఆగిరిపల్లిలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయనటువంటి అభివృద్ధి, సంక్షేమం ఒక్క జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే జరిగిందని, అందుకే ప్రజల వద్దకు వచ్చి ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని స్పష్టం చేశారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా సునీల్ కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆగిరిపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు హారతులు ఇచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ గోళ్ల అనూష, పార్టీ మండల అధ్యక్షులు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అతి పార్వతి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజన కుమారి, ఎంపీటీసీలు సాదం గోపి, నాగుల్ మీరా, సర్పంచ్ అత్తి మురళీ, మాజీ ఎంపీటీసీ నక్కనబోయిన పండు, వాకా సక్కేశ్వరరావు, చౌటపల్లి అంజయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు చిమట శ్రీనివాసరావు, పోలిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మరోసారి పట్టం కట్టండి

గణపవరం మండలంలో ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు


గోపవరంలో మోటార్‌సైకిల్‌పై ప్రచారం చేస్తున్న వాసుబాబు

గణపవరం: సంక్షేమ పథకాలను అవినీతి, పక్షపాతం లేకుండా పారదర్శకంగా ప్రజలకు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు కోరారు. మంగళవారం గణపవరం మండలం జల్లికాకినాడ, అప్పనపేట, కొందేపాడు, గోపవరం, ముగ్గుళ్ల గ్రామాలలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ లబ్ధి కోసం రైతులు, నిరుపేదలు, విద్యార్థుల సంక్షేమాన్ని బలిపెడుతున్న చంద్రబాబు ఎన్నికల హామీలను ఏమేరకు నెరవేరుస్తారో ప్రజలంతా ఆలోచించాలన్నారు. మొన్న వలంటీర్లను సామాజిక పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకుని, నేడు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వైఎస్సార్ ఆసరా పథకాల లబ్ధిని అందకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి అడ్డుకున్నారని, ఇలాంటి వ్యక్తి అధికారంలోకి వస్తే పేదలకు ఏం న్యాయం చేస్తారో ఆలోచించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారథ్యంలో రాష్ట్రం సంక్షేమ రాజ్యంగా అవతరించి ఐదేళ్లలో పేదలకు నూరుశాతం న్యాయం జరిగిందని వాసుబాబు అన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలోనే పేదలు, బీసీలు, ఎస్సీలంటూ ఓట్ల కోసం మాయమాటలతో మీముందుకు వస్తున్నారని విమర్శించారు. అధికారం కోసమే చంద్రబాబు జనసేన, బీజేపీ పంచన చేరి జగన్‌పై కుటిల పన్నాగాలు పన్నుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ఐదేళ్ల కాలంలో పేదల కోసం అమలు చేసిన పథకాలను వివరించారు. ఆయా గ్రామాలలో మహిళలు వాసుబాబుకు హారతులు పట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో స్వాగతం పలికారు. మహిళలు గుమ్మడికాయ దిష్టి తీసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, సర్పంచ్‌లు నూకారపు సుధాకర్, శీతాలం వీరలక్ష్మిపుల్లయ్య నాయుడు, పాతంశెట్టి పద్మావతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో పేదల జీవితాల్లో వెలుగు

ఏలూరు 42 డివిజన్‌లో ప్రచారంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


47వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు రూరల్: కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కోరారు. మంగళవారం ఏలూరు 42 డివిజన్ కార్పొరేటర్ కోరుపురి సత్యవతి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని కృషి కారణంగా నగరంలో మెడికల్ కాలేజీ నిర్మాణం, తమ్మిలేరు రివిట్‌మెంట్ వాల్‌తో పాటు రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వ్యవస్థ అభివృద్ధి చెందాయన్నారు. ఓటర్లు మరోసారి ఎమ్మెల్యేగా ఆళ్ల నానిని, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌లను ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఘంటా ప్రసాద్, కిలాడి దుర్గారావు, బొమ్మిశేషు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీకి రాంరాం

వైఎస్సార్ సీపీలో చేరిన కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు


చంటినాయన సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన అన్నవరానికి చెందిన యాదవ వర్గం యువత, కార్యకర్తలు

నూజివీడు : ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని ఎమ్మెల్యే, నూజివీడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) కోరారు. మండలంలోని అన్నవరానికి చెందిన యాదవ సామాజిక వర్గం యువతతో పాటు 30 కుటుంబాలు చంటినాయన ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి చంటినాయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కేవలం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమన్నారు. 30కి పైగా సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. చంద్రబాబు వస్తే రాష్ట్రాన్ని దోచుకోవడం చేయడమే కాకుండా రాష్ట్రం 30ఏళ్లు వెనక్కు వెళ్తుందన్నారు. 14ఏళ్లు ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనకు గుర్తుగా ఒక్క సంక్షేమ పథకం కూడా లేదన్నారు. ఉన్న పథకాలను నిర్వీర్యం చేయడం, తన వర్గం వారికి దోచిపెట్టడమే చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. గతంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అని చెప్పి చేయకుండా నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడన్నారు. చంద్రబాబు చెప్పేవి సూపర్‌సిక్స్ కాదని, ఆరు మోసాలని వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే ఏడాదికి రూ.2లక్షల కోట్లు అవసరమని, కాబట్టి చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయరన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పగడాల సత్యన్నారాయణ, మేకల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ నాయకుల చేరిక

యలమంచిలి : నారినమెరక గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీకి చెందిన నాయకులు వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేపల్లి జగదీష్ (రాఖీ) ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చడం వలనే అనేక మంది తెలుగుదేశం, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారంతా పాలకొల్లు ఎమ్మెల్యేగా గుడాల శ్రీహరి గోపాలరావు, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాల విజయానికి కృషి చేయాలని కోరారు. ఎంపీటీసీ ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఇర్రింకి గెద్దయ్య, రాచమళ్ల నాగేశ్వరరావు, తాడి సురేష్, దీపాటి భాను, లింగాల వెంకటరమణ, దిడ్ల సూర్యతేజ, వల్లూరి సన్నిబాబు, తరపట్ల వేణు, పంతకాని వరప్రసాద్, బొడ్డుపల్లి నితిన్, బందుల ప్రవీణ్ (కన్న), తరపట్ల చిట్టిబాబు, పెదపాటి ప్రవీణ్, వడ్డి బాలాజీ, బొర్రా రవి, వడ్డి బాబ్జి ఉన్నారు.

మద్యం దుకాణం సిబ్బందిపై కేసు నమోదు

కైకలూరు: ప్రభుత్వ మద్యం దుకాణంలో పరిమితికి మించి మద్యం సీసాలను విక్రయించిన సిబ్బంది, కొనుగోలుదారునిపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం కేసు నమోదు చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో (ఎస్ఈబీ) కైకలూరు సీఐ డీ.సుధ మాట్లాడుతూ కలిదిండి మండలం మూలలంక గ్రామంలో రావడి రామాంజనేయులు అనే వ్యక్తి వద్ద 50 మద్యం సీసాలు లభించాయన్నారు. వీటిని కొనుగోలు చేసిన ప్రభుత్వ దుకాణంలో నిబంధనలు అతిక్రమించడంతో మూలలంక ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్, ఇద్దరు సెల్స్‌మెన్‌లను విధుల నుంచి తొలగించామని సీఐ చెప్పారు.

11న రేటింగ్ చెస్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

భీమవరం: భీమవరంలో ఈనెల 11న ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మంగళవారం విలేకర్లకు చెప్పారు. బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణమండపంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.2 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఇతర వివరాల కోసం 90632 24466 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కిషోర్ కోరారు.

ముస్లింలకు అండగా జగన్


నౌషాద్ మొహిద్దీన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివంగత నేత వైఎస్సార్ బాటలోనే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా ముస్లింలకు అండగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె నౌషాద్ మోహిద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలపై రూ.26 వేల కోట్లు ఖర్చు చేశారని కొనియాడారు. ముస్లింలపై కపట ప్రేమ చూపించిన చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు కేవలం రూ.2,650 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. నేటి ప్రభుత్వం నవరత్న పథకాలే కాకుండా అనేక సంక్షేమాలు ముస్లింలకు అందిచినట్లు చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్న బీజేపీ ముస్లింలలో వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేస్తామనడం చాలా అన్యాయమని విమర్శించారు. నెల్లూరు సభలో ముస్లింలకు, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లకు గాని, సీఏఏ, ఎన్ఆర్సీ, ఇతర ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీతో పొత్తు పెట్టుకొని ముస్లింల విశ్వాసాన్ని కోల్పోయారని, వారికి తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ముస్లింలు అంతా జగన్ వెంటే ఉంటారని, వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించుకుంటామని వెల్లడించారు.



ఆరోగ్యమస్తు

వైద్యో నారాయణో హరి.. అంటే వైద్యులు దేవతలతో సమానం అని అర్థం. ఆ రోగులకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా చేయూత అందించేవారిని సైతం వారు దేవుడిగానే కొలుస్తారు. ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండలంలోని పూళ్ల గ్రామంలో ఓ మానసిక వైకల్యం గల బాలుడికి, అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు వైద్యసేవలు అందజేయడంతోపాటు సహాయ నిధి సొమ్ము అందజేసి వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకరించారు. పేదల ఆరోగ్య, ఆర్థిక పరిస్థితికి సహకారం అందిస్తూ జగన్ మానవత్వాన్ని చాటుకుంటున్నారని, మా కుటుంబాల్లో వెలుగులు నింపిన ఆయన మాకు దేవుడే అని, ఆయనకు జీవితాంతం తాము రుణపడి ఉంటామని ఆయా కుటుంబాల సభ్యులు సంతోషంగా చెబుతున్నారు.
– భీమడోలు

పిల్లాడిని చూసి చలించిపోయారు

పూళ్ల పంచాయతీ తూర్పు హరిజనపేటకు చెందిన అందుగుల లాజర్, జయశ్రీ కుటుంబం పడిన వేదన వారి మాటల్లోనే.. మాకు నవదీప్, భార్గవి ఇద్దరు సంతానం. వీరిలో నవదీప్ మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికితోడు రెండేళ్ల క్రితం నుంచి ఫిట్స్ వచ్చి ఎక్కడపడితే అక్కడ పడిపోయేవాడు. బయటకు వెళ్లినా ఇంటికి తిరిగి వచ్చేవాడు కాదు. ఎవరినీ గుర్తు పట్టేవాడు కాదు. దీనితో కుటుంబమంతా విలవిల్లాడిపోయింది. ఊరంతా తిరిగి పిల్లవాడిని వెతికి ఇంటికి తీసుకు రావాల్సిన పరిస్థితి. ఏరోజు ఏం జరుగుతుందో నన్ను భయం వెంటాడేది. పిల్లాడి ఆరోగ్యం కోసం 24 ఆసుపత్రులు తిరిగిం.. సుమారు రూ.8 లక్షలు అప్పులు చేసి వైద్యం చేయించినా పరిస్థితి ఆగమ్యగోచరం. ఇంక అప్పు కూడా దొరకని పరిస్థితి. గత ఏడాది సెప్టెంబర్ 16వ తేదీన కాపునేస్తం కార్యక్రమానికి నిడదవోలు వచ్చిన జగనన్నను ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో కలిసి మా గోడును విన్నవించుకున్నాం. ఆయన మా పిల్లాడిని చూసి చలించిపోయారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆరోజు సాయంత్రమే హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆసుపత్రిలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు.


హైదరాబాద్ సిటీ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవదీప్ (ఫైల్)


కోలుకున్న నవదీప్, కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

మా నవదీప్ ఐదు రోజుల్లో సాధారణ స్థితిలో చేరుకుని కోలుకున్నాడు. సుమారు రూ.3.50 లక్షల ఖర్చును ప్రభుత్వం భరించింది. ఇప్పుడు మా అబ్బాయి అందరి పిల్లల్లాగే ఆడుకుంటూ చదువుకుంటున్నాడు. మా దిగులంతా తీరింది. జనవరి 29వ తేదీన భీమవరం వచ్చిన జగనన్నను కలిసి నవదీప్‌ని చూపించి ఆయనకు కృతజ్ఞతలు తెలిపాం. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసిన తరువాత మందులు వాడుతున్నామని.. ప్రతి నెలా రూ.5 వేలు వరకు ఖర్చవుతున్నాయని.. మందులకు భారంగా ఉందని చెప్పగానే వెంటనే జగనన్న రూ.లక్ష సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. మా కుటుంబానికి దైవం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. జగన్ పాలనలో మాకుటుంబానికి వివిధ పథకాల ద్వారా మొత్తం రూ.11.60 లక్షల వరకు మేలు జరిగింది.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం..



ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు 3 వేలకు పైగా వ్యాధులకు చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాల ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మరెందరినో ఆదుకుంటున్నారు. వైద్యరంగానికి ఇతోధికంగా నిధులు ఖర్చుచేస్తూ ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా కల్పిస్తున్నారు.
– పుప్పాల శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ మాకు దక్కలేదు

మా కుమార్తె భార్గవికి కడుపులో కణితి వచ్చింది. చంద్రబాబు పాలనలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద మాకు సహాయం చేయలేదు. మాలాంటి పేదలకు ఆ పథకం ఉపయోగపడలేదు. రూ.1.09 లక్షల సొంత డబ్బులతో అమ్మాయికి వైద్యం చేయించుకున్నాం. చంద్రబాబును నమ్మవద్దు.

నరాల బలహీనత తగ్గింది

నా పేరు నూతులపాటి మార్తమ్మ. నాకు భర్త ఏసు, ఇద్దరు సంతానం ఉన్నారు. పిల్లలు పుట్టిన తరువాత నరాల బలహీనత వ్యాధికి గురయ్యాను. దీనితో ఎక్కువ సేపు నిలబడలేకపోవడం, వ్యక్తిగత పనులు సైతం చేసుకోలేక బాధపడేదాన్ని. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. వైద్యం చేయించుకునే స్తోమత లేదు. మా తమ్ముడు అందుగుల లాజర్ సహకారంతో జనవరి 29న భీమవరంలో సీఎం జగన్‌ను కలిశా. ఆయనకు నా బాధ చెప్పగా తక్షణమే వైద్య సహాయం చేయించాలని అధికారులను ఆదేశించారు. భీమవరంలోని వర్మ ఆసుపత్రిలో లక్షలాది రూపాయల వైద్యం ఉచితంగా చేయించారు. దీనితో నేను పూర్తిగా కోలుకున్నాను. మందుల ఖర్చులు కూడా భారం కాకూడదని రూ.లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఆయన మేలును మరువలేను.


సీఎం జగన్‌కు తన బాధను వివరిస్తున్న మార్తమ్మ (ఫైల్)

జగన్‌కు జైకొట్టిన ఆటో డ్రైవర్లు

తణుకులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


తణుకులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

తణుకు అర్బన్: స్వయం శక్తితో జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లని గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని భారత మాత ఆటో యూనియన్ కార్యదర్శి కంచుమర్తి విశ్వేశ్వరరావు అన్నారు. తణుకు ఆర్టీసీ బస్సు డిపో ఎదురుగా ఉన్న భారతమాత ఆటో స్టాండ్ వద్ద మంగళవారం యూనియన్ సమావేశం అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఆటో డ్రైవర్లు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటకలో అమలవుతున్న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకం ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 6 లక్షలకు పైగా ఆటో డ్రైవర్లు తమ కుటుంబాలను ఇదే వృత్తిలో ఉంటూ పోషించుకుంటున్నారని.. అందుకే ఈ పథకం వద్దని తాము రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించినా టీడీపీ తమపై కరుణ చూపించకుండా మేనిఫెస్టోలో ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా మొర ఆలకించి అమలుకు సాధ్యం కాని ఆ పథకాన్ని తన మేనిఫెస్టోలో పెట్టకుండా మాకు అండగా నిలిచారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు అందజేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆ మొత్తాన్ని రెట్టింపు చేస్తానని మేనిఫెస్టోలో పెట్టడాన్ని మేమంతా స్వాగతిస్తున్నామని చెప్పారు. సీఎం జగన్‌కు తామంతా అండగా నిలబడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారతమాత ఆటో యూనియన్ సభ్యులు ఎస్.నరసింహమూర్తి, వి.ప్రశాంత్‌కుమార్, కడలి శ్రీను, వి.ఫిలిప్, కుక్కల బాలాజీ, కుక్కల నారాయణ, వీరభద్రపురం రాజు, కుక్కల దైబు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్.. చంద్రబాబు జేబు సంస్థా..?

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఎన్నికలలో అవాంఛనీయ చర్యలను నియంత్రించాల్సిన ఎన్నికల కమిషన్.. ప్రజలు సిగ్గుపడేలా, హాస్యాస్పదంగా వ్యవహరిస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం తాడేపల్లిగూడెం మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ అంటే చంద్రబాబు జేబు సంస్థా అనే విధంగా చర్యలున్నాయన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న విద్యాదీవెన, రైతులకు విత్తనాల సరఫరా వంటి వాటిని అమలు చేయకుండా ఉండటం వివిధ వర్గాలకు నష్టం కలిగించే చర్య అని అన్నారు. తెలంగాణలో అడ్డం రాని ఆంక్షలు ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు వస్తున్నాయన్నారు. సకాలంలో రైతులకు విత్తనాలు సరఫరా చేయకుంటే వారు నారుమళ్లు ఎలా వేసుకుంటారు.. ఇదేమి ఎన్నికల హామీ కాదు కదా అని ప్రశ్నించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం బాబుకు ఇష్టం ఉండదని కొట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యమా, చంద్రబాబు స్వామ్యమా అని ప్రశ్నించారు. మోదీ, చంద్రబాబు వదిన పురందేశ్వరి చెప్పిన విధంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమిని ఘోరంగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చిత్రంలో నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

జగన్ గెలుపును ఆపలేరు

ఎన్నికల కమిషన్ తదితర వ్యవస్థల ద్వారా రాష్ట్రంలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూసినా, ఎవ్వరూ ఎన్నిరకాలుగా కుట్రలు పన్నినా జగన్ గెలుపును ఆపలేరని గూడూరి ఉమాబాల అన్నారు. కూటమి పార్టీలు ప్రజలకు చెడు చేస్తూ జగన్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలనుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో కూటమికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

చంద్రబాబు కనుసన్నల్లో ఈసీ నడుస్తోంది

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుగొండ: రాష్ట్రంలో ఎన్నికల కమిషన్.. చంద్రబాబు కమిషన్‌గా విధులు నిర్వహిస్తున్నట్టు ప్రజలకు అనుమానాలు కలుగుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్డీయే కూటమిలో చేరిన తర్వాత ఎన్నికల కమిషన్ లేనిపోని నిబంధనలు పెడుతోందన్నారు. ఎక్కడా లేని నిర్ణయాలు రాష్ట్రంలో అమలు చేస్తూ ఎలక్షన్ కమిషన్ చంద్రబాబుకు ఒక తొత్తులా.. వారి కనుసన్నల్లో పనిచేస్తోందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రావలసిన విద్యాదీవెన సుమారు రూ.610 కోట్లు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.847 కోట్లు వారి ఖాతాల్లో జమ కాకుండా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఇవి కొత్తగా పెట్టిన పథకాలు కావని, రాష్ట్రంలో ఐదేళ్లుగా అమలు చేస్తున్నవేనని గుర్తుచేశారు. ఎన్నికల కమిషన్ పునరాలోచించుకుని విద్యార్థులకు, రైతులకు న్యాయం చేసే విధంగా నిధులను విడుదల చేయాలని, ఈమేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఆదేశాలు ఇవ్వాలని శ్రీరంగనాథరాజు కోరారు.

ఈసీది పక్షపాత వైఖరి

కొయ్యలగూడెం: ఎలక్షన్ కమిషన్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన పక్షపాత వైఖరి అవలంభిస్తుందని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్కే హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో తెలంగాణలో అనుమతించిన ఈసీ ఆంధ్రప్రదేశ్‌లో అనుమతించకపోవడం అన్యాయం అన్నారు. 2019వ సంవత్సరంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజు ముందు వరకు పసుపు కుంకుమ పథకం పేరిట పదివేల రూపాయలు జమ చేయడం జరిగిందని. ఇప్పుడు రైతులను ఆదుకునే విషయంలో ఈసీ అడ్డుపడుతోందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు సంక్షేమ పథకాల ద్వారా అందాల్సిన సొమ్ములు కూడా జమ కాకపోవడంతో తల్లిదండ్రులు వేదన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులను ఎలక్షన్ కమిషన్ బదిలీ చేస్తున్న ప్రక్రియ అనుమానాలకు తావిస్తోందని, ఈసీ వెనుక ఎవరు ఉన్నారనేది ప్రజలందరికీ అర్థమవుతోందని అన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఆంక్షలు విధిస్తున్న ఈసీ నిర్ణయాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తున్నారని ఈ విషయంలో రాష్ట్రపతి కలగచేసుకొని రైతులకు విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఇది రాజ్యాంగ విరుద్ధం

చెల్లెం ఆనందప్రకాష్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు



పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం ఎప్పటి నుంచో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎన్నికల కమిషన్ నిలుపుదల చేయడం రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. యాళ్లవానిగరువులో తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాదీవెన, విద్యావసతి పథకాలను ఆపడం సరికాదన్నారు. దీని వల్ల దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎందరో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు చెల్లించకపోవడం, కళాశాలలు టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, దీంతో విద్యార్థుల నుంచి ప్రతి రోజు ఎస్సీ కమిషన్‌కి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాలనలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోరాదన్నారు. ఎస్సీ కమిషన్ కూడా రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సంస్థే అని చెప్పారు. ఎన్నికల కమిషన్ చర్యలు చూస్తుంటే కేంద్రానికి కొమ్ముకాస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. ప్రతిపక్షం వారు ఫిర్యాదు చేస్తే చాలు విచారణ లేకుండా డీజీపీని, పరిపాలనాధికారులను మార్చడం చూస్తుంటే రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని అర్థమవుతుందన్నారు. తెలంగాణలో రైతు భరోసా అమలు చేస్తున్నారని.. అక్కడ లేని నిబంధనలు ఏపీలో ఎందుకు అని ప్రశ్నించారు.

మా గుండెల్లో కొలిచేనేత ఆయన

- నవ్వులు పంచిన నవరత్నాలు
- ఒకప్పుడు భారంగా జీవనం
- ఆశపు ఇంట సంతోషాల సిరులు



గతమెంతో 'హీనం'

ఇక్కడ మగ్గం దగ్గర కనిపిస్తున్న పెద్దావిడ పేరు ఆశపు భ్రమరాంబ. చిన్నప్పటి నుంచి నేత చేసుకోవడం పదీ.. పరకా సంపాదించుకోవడం ఒకటే తెలుసు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పట్టణం వీవర్స్ కాలనీకి చెందిన సూర్యచంద్రరావుతో పెళ్లయింది. భర్త కూడా నేత కార్మికుడే. పెళ్లయినప్పటి నుంచి భర్తతో కలసి వీవర్స్‌కాలనీలో మగ్గంపైనే కష్టపడుతూ జీవనం సాగించేది. వీరి కుమారుడు నాగరాజు, కోడలు శాంతకుమారి కూడా నేత కార్మికులే. అయితే చేనేత ప్రాభవం బాగా ఉన్న రోజుల్లో వీరికి పెద్దగా ఆర్థికంగా ఒడిదుడుకులు ఉండేవి కాదు. అయితే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరి జీవనం మరీ దుర్భరంగా మారింది. నేత కార్మికులకు, మగ్గందారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడం, ఆరుగాలం మగ్గంపై శ్రమించినా సరైన ఆదాయం లేకపోవడంతో కొన్ని నెలలు మగ్గం మూసేసి వేరే పనులు కూడా చేసుకున్నారు. ఈ బతుకు ఎందుకూ అనిపించేది.

దశ తిరిగింది

2019 తర్వాత బతుకుపై 'ఆశపు'ట్టే

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేనేతదారుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు భ్రమరాంబ కుటుంబానికి కలిసి వచ్చాయి. సంక్షేమ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు నవ్వులు పంచాయి. దీంతో మూలన పడిన మగ్గం మళ్లీ పరిగెత్తడం ప్రారంభించింది. ఆ ఇంట్లో మగ్గాల సంఖ్య రెండుకు చేరాయి. ప్రస్తుతం భ్రమరాంబ ఆమె భర్తతోపాటు కొడుకు నాగరాజు, కోడలు శాంతి కుమారి అంతా మగ్గాలపై చీరలు నేస్తున్నారు. 5 దఫాలుగా ఆ కుటుంబానికి వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా రూ.2.40 లక్షలు వచ్చాయి. భ్రమరాంబ భర్త చంద్రరావుకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. కోడలు శాంతకుమారికి వైఎస్సార్ చేయూత పథకంలో ఏడాదికి రూ.18,750 చొప్పున రూ.56,250 వచ్చింది. నాగరాజు శాంతకుమారి దంపతులకు 5వ తరగతి, 6వ తరగతి చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో ఒకరికి అమ్మఒడి పథకంలో ఈ 5 ఏళ్లలో రూ.80 వేలు జమయ్యాయి. ఇక భ్రమరాంబతో పాటు కోడలు శాంతకుమారి ఇద్దరికి కూడా పట్టణంలో జగనన్న కాలనీలో ఇళ్లస్థలాలు ఇచ్చారు. ఈ రెండు స్థలాలు కలిపి రూ.15–17 లక్షలు విలువ చేస్తాయి. ఇలా ఈ ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి పథకాల రూపంలో వచ్చిన సహాయం మొత్తం సమారు రూ.20 లక్షలకు చేరింది. దీంతో ఆ కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఇప్పుడు అందరూ ఆనందంగా జీవిస్తున్నారు. ఇదంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యం వల్లే సాధ్యమైందని, మేం నిత్యం కొలిచే నేత ఆయన అని ఆ కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోంది.
– నరసాపురం

సంక్షేమం సగం బలం

చిన్న కుటుంబానికి కొండంత మేలు

పథకాల ద్వారా ఇంటిల్లిపాదికీ లబ్ధి

రూ.రెండున్నర లక్షలకుపైగా సాయం


చినతాడేపల్లిలోని దూలపల్లి సుబ్బారావు కుటుంబం

దశ తిరిగింది

2014-19 మధ్య..

వయస్సు మీద పడుతున్నా.. కుటుంబం కాడిని బలవంతాన భుజానికెత్తుకుని లాగాల్సిన స్థితి. చింతలున్న చిన్న కుటుంబమమే అయినా, ఆశలను వాయిదా వేసుకోవాలి. ఉన్న కాడికి నాలుగు మెతుకులు తిని, నీడ పట్టున కునుకు తీద్దామనుకొనే లోగా, కష్టాల స్వప్నాలు నిద్రాభంగం కలిగించేవి. ఉన్న ఒక్క బిడ్డ చిన్న ప్రైవేటు ఉద్యోగి. బిడ్డ తెచ్చే నాలుగు రూపాయలు వేన్నీళ్లకు చన్నీళ్లగా మాత్రమే ఉపయోగపడేవి. వృద్ధాప్య పింఛన్ పొందే అర్హత ఉన్నా, గ్రామంలో ఎవరైనా చనిపోతే చెప్పు, జన్మభూమి కమిటీతో చెప్పించుకో పింఛన్ వస్తుందనే పచ్చనాయకుల ఉచిత సలహాలు. ఐదేళ్ల క్రితం వరకు ఇదే తీరు. రెక్కల కష్టాన్ని నమ్ముకొని గౌరవంగా కుటుంబాన్ని ఈడ్చుకొస్తున్న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలోని దూలపల్లి సుబ్బారావు కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ వరాల రేడుగా మారారు.

2019 తర్వాత..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక దూలపల్లి సుబ్బారావుకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. నాలుగేళ్ల నుంచి ఠంచన్‌గా ఒకటో తేదీనే వస్తోంది. ఇప్పటివరకు లక్ష రూపాయలకుపైగా అందింది. సుబ్బారావు కుమారుడు జయరాజు ఒక ప్రైవేటు స్కూలులో పనిచేస్తున్నాడు. అతనికి కిడ్నీలో రాళ్లు ఏర్పడటంతో ఆరోగ్యశ్రీలో సుమారు రూ.40 వేలు ఖరీదైన చికిత్స చేశారు. సుబ్బారావు కోడలిగా వచ్చిన సుమలత పదో తరగతి వరకు చదువుకున్నారు. టైలరింగ్ వచ్చు. చేయూత ద్వారా ఆమెకు ఇప్పటివరకు రూ.30 వేల లబ్ధి కలిగింది. ఆమె కూతురు సుజన, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియంలో ఆరో తరగతి చదువుతోంది. అమ్మఒడి ద్వారా ఇప్పటికి నాలుగు విడతల్లో రూ.53 వేల వరకు లబ్ధి చేకూరింది. సుజన తమ్ముడు శ్రవణ సుజిత్ ఎల్‌కేజీ చదువుతున్నాడు. సుమలత డ్వాక్రా సంఘంలో కూడా సభ్యురాలిగా ఉండటంతో ఆమెకు ఆసరా ద్వారా ఇప్పటి వరకు రూ.41,200 వరకు ప్రయోజనం చేకూరింది. మొత్తంగా ఆ కుటుంబానికి రూ.2.60 లక్షల వరకు మేలు జరిగింది. దీంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. దేవుడిచ్చిన సీఎం జగన్‌బాబు అంటూ సుబ్బారావు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
– తాడేపల్లిగూడెం